క్లుప్తంగా

వైభవంగా చౌడేశ్వరి దేవి జ్యోతుల ఉత్సవం



జ్యోతుల ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో తొగట వీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో చౌడేశ్వరి దేవి అమ్మవారి జ్యోతుల ఉత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. మూడేళ్లకోసారి అమ్మవారి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించడం తొగట వీర క్షత్రియుల ఆనవాయితీ. అందువల్ల గ్రామంలోని నాగేశయ్య, శేఖర్, రమణ, మల్లయ్య, రంగం శేఖర్, అంబటి శివశంకర్ రెడ్డి సంయుక్తంగా 19 జ్యోతులను గ్రామ పుర వీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా మిడుతూరు, కల్లూరు, లక్ష్మీపురం, ప్రాతకోట బృందం నందికోలలతో నృత్యాలు చేస్తూ డప్పులు, మేళతాళాలతో తలపై జ్యోతులను ధరించి ప్రదర్శించారు. వైభవంగా సాగిన ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

ఎస్టీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ బాలాజీనాయక్

ఆత్మకూరు: షెడ్యూల్డ్ ట్రైబ్స్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్టీటీఎఫ్) 2025 క్యాలెండర్‌ను శనివారం ఎంఈఓ బాలాజీనాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రైల్వే డిపార్ట్‌మెంట్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లునాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత



విజేత జట్లకు నగదు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పగిడ్యాల: సంక్రాంతి తిరునాలను పురస్కరించుకుని పడమర ప్రాతకోట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీల విజేతలకు నిర్వాహకులు అంబటి అశోక్‌కుమార్‌రెడ్డి, బెస్త మల్లికార్జున శనివారం నగదు బహుమతులను అందజేశారు. మూడు రోజుల పాటు కొనసాగిన పోటీలలో ప్రాతకోట ఫణీంద్ర జట్టు మొదటి విజేతగా నిలువగా ఆర్‌సీఎం టీమ్ రెండవ విజేతగా, గణపురం కాంత్ టీమ్ మూడవ విజేతగా నిలిచాయి. బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ బౌలర్‌గా ఎంపికైన కాంత్, జనార్దన్‌రెడ్డికి షీల్డ్స్ అందజేసి సత్కరించారు.

దాతలకు సన్మానం



రిటైర్డ్ ఆర్మీ ఏఎంసీ భూమా శేషిరెడ్డిని సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

పగిడ్యాల: మండలంలోని తూర్పు ప్రాతకోట పార్వతీ నాగేశ్వరస్వామి నూతన రథోత్సవ నిర్మాణానికి గుప్పిలి విప్పి వితరణ చేసిన దాతలను కమిటీ సభ్యులు చిలుకల శంకర్‌రెడ్డి, అంబటి మోక్షేశ్వరరెడ్డి, టీచర్ శ్రీనివాసులు శనివారం ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రాల్లో నాగేశ్వరస్వామి ఆలయం ప్రతీతి అన్నారు. 8వ శతాబ్దంలో నిర్మించిన నాగేశ్వరస్వామి రథోత్సవం శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానంలో నూతన రథోత్సవాన్ని తయారు చేయించేందుకు దాతలు విరివిగా విరాళాలు అందజేసి సహకరించారన్నారు. నూతన రథోత్సవానికి, రథశాలకు దాదాపు రూ.42 లక్షలు ఖర్చు చేశామన్నారు. రథోత్సవ నిర్మాణంలో గుప్పిలి విప్పిన దాతలందరిని శాలువా కప్పి స్వామివారి మెమొంటోతో సత్కరించామన్నారు.

గొడవలకు దూరంగా ఉండాలి



గ్రామస్తులకు సూచనలు చేస్తున్న ఎస్‌ఐ కేశవ

కొత్తపల్లి: గొడవలు, అల్లర్లకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ కేశవ ప్రజలకు సూచించారు. శనివారం రాత్రి కొక్కెరంచ గ్రామంలో పర్యటించారు. నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి ఉండాలన్నారు. నాటుసారా విక్రయాలు, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని కోరారు. ఓటీపీ ఫ్రాడ్స్, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

దర్జాగా కబ్జా

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట రూ.కోటి విలువైన భూమిని కబ్జా చేసిన టీడీపీ నేత
- కేసు కోర్టులో ఉండగానే భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు
- న్యాయం చేయాలని కోరుతున్న పేదలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు





టీడీపీ నాయకుడు ఆక్రమించుకొన్న స్థలం (ఇన్‌సెట్)లో కేజీ రోడ్డు పక్కన్నే ఉన్న స్థలాన్ని ఆక్రమించుకొని సోలార్ ఫెన్సింగ్ నిర్మించిన టీడీపీ నాయకుడు

జూపాడుబంగ్లా: కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలను దర్జాగా కబ్జా చేసేస్తున్నా అడిగే నాథుడు లేడు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పేదలకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని సైతం టీడీపీ నాయకుడు దౌర్జన్యంగా ఆక్రమించాడు. బాధితులు కోర్టును ఆశ్రయించారు. సమస్య కోర్టులో ఉండగానే సదరు టీడీపీ నాయకుడు ఫెన్సింగ్ వేయటాన్ని చూస్తే వారి ఆగడాలు ఎలాగున్నాయో అర్థం చేసుకోవచ్చు.

స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ఎదుట కర్నూలు-గుంటూరు రహదారి పక్కన 117/బీ2లో 0.28సెంట్ల ప్రభుత్వ స్థలం ఉంది. ప్రస్తుతం అక్కడ సెంటు స్థలం రూ. 4 లక్షలు పలుకుతుంది. ఈ లెక్కన 28 సెంట్ల స్థలం రూ.కోటి పైగా అవుతుంది. 2002లో రెవెన్యూ అధికారులు 117/బీ2 సర్వేనెంబర్‌లోని స్థలాన్ని జూపాడుబంగ్లాకు చెందిన మల్లెపోగు దేవమ్మ, మాదిగ సరోజమ్మలకు ఒక్కొక్కరికి ఐదు సెంట్ల చొప్పున, 2003లో భాషపోగు సుశీలమ్మ, కాశపోగు జయమ్మలకు ఒక్కొక్కరికి ఐదు సెంట్ల చొప్పున రెవెన్యూ అధికారులు పట్టాలు మంజూరు చేశారు. అయితే వీరి స్థలాలను నందికొట్కూరుకు చెందిన టీడీపీ నాయకుడు కబ్జా చేసినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు టీడీపీ నాయకుడు తంగడంచ గ్రామంలోని సర్వేనెంబర్ 22ఏ ను వేసి ప్రభుత్వం తమకిచ్చిన స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు సమాచారం. రెవెన్యూ అధికారుల రికార్డుల ప్రకారంగా ఈ సర్వేనెంబర్ తంగడంచ గ్రామంలోని ఐదో వార్డులో ఉంది. స్థలాలు కబ్జాచేసిన విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలియజేసినా ప్రయోజనం లేకపోవటంతో 2021లో అక్టోబర్ మాసంలో మల్లెపోగు దేవమ్మ నందికొట్కూరు కోర్టును ఆశ్రయించింది. స్థలం విషయమై ఈనెల 29న కోర్టులో వాయిదా ఉండగానే టీడీపీ నాయకుడు దౌర్జన్యంగా స్థలాల చుట్టూ ఫెన్సింగ్ నిర్మించుకున్నాడు. ఇదే విషయమై పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు.

కోర్టులో ఉండగానే దౌర్జన్యంగా ఫెన్సింగ్ వేశారు



రెవెన్యూ అధికారులు నాతో పాటు మరో ముగ్గురికి తలా ఐదు సెంట్ల స్థలం కేటాయిస్తూ పట్టాలిచ్చారు. మాకిచ్చిన స్థలాలను నందికొట్కూరుకు చెందిన టీడీపీ నాయకుడు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడు. స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు చూపించమంటే చూపించడం లేదు. తంగడంచ గ్రామంలోని సర్వేనెంబర్ 22ఏ వేసి మా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈనెల 29న స్థలానికి సంబంధించి కోర్టులో వాయిదా ఉండగానే దౌర్జన్యంగా ఫెన్సింగ్ వేసి బెదిరింపులకు పాల్పడుతున్నాడు.

– మల్లెపోగు దేవమ్మ, జూపాడుబంగ్లా

రికార్డులు పరిశీలిస్తున్నాం

తహసీల్దార్ కార్యాలయానికి ఎదురుగా కేజీ రోడ్డు పక్కన ఉన్న స్థలం చుట్టూ ఫిన్సింగ్ వేస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఆ స్థలం తమదేనంటూ నందికొట్కూరుకు చెందిన వారు వచ్చారు. స్థలం ఎవ్వరిదనే విషయమై రికార్డులు పరిశీలిస్తున్నాం. ఇరువర్గాల వద్ద ఉన్న డాక్యుమెంట్లు తెప్పించుకొని పరిశీలిస్తాం. రెవెన్యూ రికార్డుల ప్రకారం స్థలం ఎవ్వరికి వర్తిస్తుందనే విషయమై పరిశీలించాలని వీఆర్వోను ఆదేశించాను.

– చంద్రశేఖర్‌నాయక్, తహసీల్దార్

నేడు అందుబాటులో మాజీ ఎమ్మెల్యే

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని ఆ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్ మీర్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఈనెల 20న వెలుగోడు, 21, 22 తేదీల్లో నంద్యాల పార్టీ కార్యాలయాల్లో శిల్పా చక్రపాణి రెడ్డి అందుబాటులో ఉంటారన్నారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు, 27నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ ఎం.దస్తగిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ కార్యదర్శుల పర్యవేక్షణలో ఏర్పాటు చేయనున్న ఆధార్ కేంద్రాలను సద్వినియోగ చేసుకోవాలన్నారు.

రేపటి నుంచి భూముల రీ సర్వే

పగిడ్యాల: పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన పగిడ్యాలలో సోమవారం నుంచి ప్రైవేట్ భూముల రీ సర్వే ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ శివరాముడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని 25 బ్లాక్‌లుగా విభజించి, ప్రతి బ్లాక్‌లో 200 నుంచి 250 ఎకరాలు చేస్తామన్నారు. రైతులకు రెండు రోజులు ముందుగానే నోటీసులు జారీ చేసి రీ సర్వే చేస్తామన్నారు.

మల్లన్న క్షేత్ర పరిధిలో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు చేస్తున్న స్వచ్ఛంద సేవకులు

శ్రీశైలంటెంపుల్: స్వచ్ఛ శ్రీశైలం కార్యక్రమాలలో భాగంగా నంద్యాలకు చెందిన ‘మన ఊరు–మన బడి–మన బాధ్యత’ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం 250 మంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఘంటా మఠం ప్రాంగణం, గంగా భవానీ స్నానఘట్టాలు, పాతాళగంగమెట్ల మార్గం, పాతాళగంగ స్నానఘట్టాలు, శిఖరేశ్వరాలయం వద్ద పుష్కరిణి వద్ద స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ నంద్యాల విభాగం కన్వీనర్ కె.రఘువీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.నరసింహారెడ్డి, ఏఈఓ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ప్రశ్నించే వారిపై దుష్ప్రచారం తగదు



కబ్జాకు గురైన స్థలం వద్ద శెట్టి జయమ్మ, కుటుంబ సభ్యులు, మాలమహానాడు నాయకులు

నందికొట్కూరు: పేద మహిళ శెట్టి జయమ్మకు చెందిన ఇంటి స్థలం కబ్జా చేసిన వైనంపై ప్రశ్నించిన వారిపై దుష్ప్రచారం చేయడం తగదని మాలమహానాడు నాయకులు ఏసీహెచ్ నగేష్, వేల్పుల సుంకన్న అన్నారు. శనివారం మారుతీనగర్‌లో బాధిత మహిళతో కలిసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేద మహిళ శెట్టి జయమ్మకు ఇంటి స్థలం ఇచ్చిందన్నారు. ఆ స్థలంలో బేష్ మట్టం వరకు నిర్మించుకుని తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకుని నలుగురు కుమారులు, కోడళ్లతో కలిసి జీవనం సాగిస్తోందన్నారు. మహిళ కుటుంబం వలస వెళ్లిన సమయంలో నాగరాజు అనే వ్యక్తి గుడిసెను పీకేసీ రేకుల షెడ్డును నిర్మించి స్వాధీనం చేసుకున్నాడని ఆరోపించారు. ఇదే విషయమై బాధిత మహిళకు అండగా నిలిచిన వారిపై లేనిపోని ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. కరపత్రాలు వేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు మనోహర్, చరణ్, అర్లప్ప, కుమార్ పాల్గొన్నారు.

కొలనుభారతిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



కొలనుభారతిదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపల్లి: పవిత్ర పుణ్యక్షేత్రం సరస్వతి అమ్మవారు కొలువైన కొలనుభారతి దేవి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రోధినామ సంవత్సరం పుష్య మాసం ఉత్తరాయణం కృష్ణ పక్షం, హేమంత ఋతువు ఉత్తరాషాఢకార్తె బహుళ పంచమి శనివారం రోజున చదువుల తల్లి సరస్వతి దేవి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సంక్రాంతి పర్వదిన సెలవులు పూర్తి కావస్తుండడంతో కొలనుభారతి క్షేత్రంలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని భక్తిపరావశ్యంతో తరించి పోయారు. ఆలయ ప్రాంగణంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులకు ఆలయ పురోహితులు బీజాక్షరాలు దిద్దించి అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు.

చట్టాన్ని పటిష్టంగా అమలు చేయండి



మాట్లాడుతున్న చైర్ పర్సన్ డి.నాగజ్యోతి

ఆత్మకూరు: పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజరీ కమిటీ, మల్టీ మెంబర్ అప్రాపియేట్ కమిటీ మీటింగ్ చైర్ పర్సన్ డి.నాగజ్యోతి(ఆర్డీఓ) సూచించారు. శనివారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసే విషయంపై డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ స్థాయి హైస్కూళ్లలో, జూనియర్ కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్స్, ఆశా కార్యకర్తలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీప్రసన్న, సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, అధికారులు జుల్ఫికర్ అహ్మద్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తరపున జి.వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ మద్దిలేటి, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ కల్లూరి పెద్ద మస్తానయ్య పాల్గొన్నారు.

25న దివ్యాంగుల క్రీడా పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 25వ తేదీన ఎన్‌జీఓ కాలనీలోని గురురాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాల క్రీడా మైదానంలో దివ్యాంగుల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికృష్ణ, రమణయ్య తెలిపారు. శనివారం పట్టణంలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ పోటీల్లో ఎంపికైన వారు ఈనెల 30వ తేదీన గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ క్రీడా పోటీల్లో 100, 200, 400, 1500 మీటర్ల పరుగు పందేలు, హైజంప్, లాంగ్ జంప్, జావెలిన్, షాట్‌పుట్, త్రోబాల్, డిస్కస్‌త్రో పాటు పలు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శారీరక, మానసిక, కంటి చూపు, మరుగుజ్జు దివ్యాంగులు పోటీల్లో పాల్గొంటారన్నారు. ఉపాధ్యక్షులు బాబాఫకృద్దీన్, సంయుక్త కార్యదర్శి మధుకుమార్, ఆలమధు, వెంకటరావు, కల్యాణి, వీరభరతుడు పాల్గొన్నారు.

మాలల యుద్ధ గర్జనను విజయవంతం చేయండి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నందికొట్కూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రాయలసీమ మాలల యుద్ధ గర్జనను విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా నాయకులు యాట ఓబులేసు కోరారు. శనివారం అంబేడ్కర్ విగ్రహానికి మాలలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎస్‌ఐ టౌన్ చర్చి ఆవరణలోని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయనతోపాటు మాలమహానాడు నాయకులు మాధవస్వామి, కుందా వెంకటేశ్వర్లు ప్రసంగించారు. లక్షల మంది మాలలతో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 23న కర్నూలు జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కళాశాల మైదానంలో రాయలసీమ మాలల యుద్ధ గర్జన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మాలలు భారీగా తరలి రావాలని కోరారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరముందన్నారు. అనంతరం యుద్ధ గర్జన కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు ఏసీహెచ్ నగేష్, రవికుమార్, అచ్చన్న, ఎర్రన్న, వేల్పుల సుంకన్న, జ్యోతి, డాక్టర్ చంద్రశేఖర్, రాజు, అర్లప్ప, అబ్రహం, నాగరాజు, జయరాం, మల్లయ్య, డాక్టర్ వెంకటేష్, మనోహర్, చరణ్ పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

వెలుగోడు: ఈనెల 21 నుంచి వెలుగోడు, రేగడ గూడూరు గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 21, 23వ తేదీలలో వెలుగోడులో, 23, 24 తేదీలలో రేగడ గూడూరులో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు.

21న జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. శనివారం జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ జాబ్ మేళాలో నాలుగు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. ఈ జాబ్ మేళాకు పది, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు వారి విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్: 9440224291 నంబరులో సంప్రదించాలని కోరారు.

విజయ డెయిరీ చైర్మన్‌గా పాడి రైతునే నియమించాలి

నంద్యాల(న్యూటౌన్): పాడిని పోషిస్తున్న వారినే విజయ డెయిరీకి చైర్మన్‌గా నియమించాలని, ఇతర సామాజిక వర్గాలకు ఒక్కసారైనా అవకాశం కల్పించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్, కాంగ్రెస్ పార్టీ నంద్యాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 40 ఏళ్లుగా కుటుంబ పాలనలో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని కోరారు. విజయ డెయిరీ పరిరక్షణ కోసం ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని పోరాటాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీలకు చైర్మన్ పదవి దక్కలేదని, ఇప్పటికైనా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు.

మెప్మా ఉద్యోగి వేధింపులు

- జీపీతో పడిపోయిన పొదుపు గ్రూప్ లీడర్
- ఆస్పత్రికి తరలించిన తోటి మహిళలు
- పార్టీ అంటగట్టి వేధిస్తున్నాడని బాధిత మహిళ ఆరోపణ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న షఫీవున్

ఆత్మకూరు: స్థానిక మెప్మా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీసీ వెంకటేశ్వర్లు వేధింపులతో పొదుపు లక్ష్మి గ్రూప్ లీడర్ షఫీవున్ ఆస్పత్రి పాలైంది. బాధితురాలు తెలిపిన వివరాలు.. గ్రూపుల్లోని కొందరు మహిళలను(వైఎస్సార్‌సీపీకి చెందిన వారిని)టార్గెట్ చూసి వెలుగు సీసీ వెంకటేశ్వర్లు వేధింపులకు పాల్పడుతున్నాడు. శనివారం మెప్మా కార్యాలయంలో ఓబీసీ పొదుపు మహిళా సమావేశం నిర్వహించారు. సమావేశంలో షఫీవున్‌తోపాటు మరికొంతమంది పొదుపు మహిళలను సర్వేలు సరిగా చేయడం లేదని, ఇలా అయితే మెమోలు ఇస్తానని మందలించారు. అన్నీ సక్రమంగా చేసినా వేధింపులకు గురి చేయడంతో ఆందోళనకు గురైన షఫీవున్ ఒక్కసారిగా పడిపోయింది. దీంతో తోటి సభ్యురాళ్లు ఆమెను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. అనంతరం షఫీవున్ విలేరులతో మాట్లాడుతూ సర్వేల పేరుతో సీసీ కొంతమందిని మాత్రమే వేధిస్తున్నాడని ఆరోపించారు. అధికారులు సీసీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సురేష్‌బాబు

పాములపాడు: చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు డ్రోన్ కెమెరాలతో అడ్డుకట్ట వేయనున్నట్లు ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు. శనివారం స్థానిక బస్టాండులో ఎస్‌ఐ ప్రజలతో మాట్లాడారు. పేకాట, మట్కా, మద్యం తాగడం, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నామన్నారు. నేరాలు జరిగే ప్రదేశాలకు వెళ్లకుండానే ఉన్న చోటు నుంచి పసిగట్టేలా ఏర్పాట్లు చేశామన్నారు. సైబర్ నేరాగాళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆధార్, ఓటీపీ, బ్యాంక్ ఖాతాల వివరాలు ఇవ్వాలని కోరితే సమీపంలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఎన్‌టీఆర్ సేవలు మరవలేనివి



ఎన్‌టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు: నందమూరి తారక రామారావు సేవలు మరవలేనివని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శనివారం పట్టణంలోని అల్వాల కళ్యాణ మండపంలో ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌టీఆర్ అభిమానులు రక్త దానం చేశారు. ఎన్‌టీఆర్ ఆశయాల కోసం టీడీపీ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, ముర్తుజావలి, రబ్బానీ, వెంకటేశ్వర్లు, రమేష్‌రెడ్డి, మాండ్ర సురేంద్రనాథరెడ్డి, వీరం ప్రసాదరెడ్డి, మండ్లం మోహన్ రెడ్డి, గిరీశ్వరరెడ్డి, షకీల్ అహ్మద్ పాల్గొన్నారు.

స్వచ్ఛతవైపు ఒక అడుగు వేయండి

- ఎమ్మెల్యే జయసూర్య



పటేల్ సెంటర్‌లో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: స్వచ్ఛత వైపు ప్రతి ఒక్కరూ ఒక అడుగు ముందుకు వేయాలని ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారులపై స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్... స్వచ్ఛ దివస్ ర్యాలీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. పటేల్ సెంటర్‌లో స్వచ్ఛతపై అవగాహన కలిస్తూ ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా ప్రతి రోజు వీధులను కార్మికులతో శుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్ బేబిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

■ జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం నిర్వహించిన స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని అధికారులు మొక్కుబడిగా నిర్వహించారు. ఎంపీడీఓ గోపికృష్ణ తాటిపాడు, ఎంపీడీఓ కార్యాలయం వద్ద, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తహసీల్దార్ కార్యాలయం వద్ద పొరకపట్టి ఫొటోలకు ఫోజులిచ్చి వెళ్లిపోయారు.

■ కొత్తపల్లి: మండల కేంద్రంతోపాటు గుమ్మడాపురంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ఉమారాణి, గుమ్మడాపురం సర్పంచు నక్క విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఉపసర్పంచు శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

■ మిడుతూరు: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి, బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుసేన్, ఎంపీడీఓ దశరథరామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

■ పాములపాడు: స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండల ప్రత్యేకాధికారి రాజు ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాల వద్ద పారిశుద్ధ్య పనులు చేశారు. కార్యక్రమంలో సర్పంచు మేకల భాగ్యమ్మ, ఎంపీడీఓ చంద్రశేఖర్, డీటీ పఠాన్‌బాబు, ఏపీఓ విమలమ్మ, ఏపీఎం ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

■ పగిడ్యాల: మండల వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై పంచాయతీ అధికారులు ర్యాలీలు చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతను పాటించి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎంపీడీఓ సుమిత్రమ్మ ప్రజలకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుదామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, వెలుగు ఏపీఎం చంద్రకళ, ఏపీఓ మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, లక్ష్మీనారాయణమ్మ, కాసీం, వీరన్నయాదవ్, కోట్ల వెంకటేశ్వర్లు, శ్వేత పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



చెత్త తొలగిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కాంతారావునాయక్, సిబ్బంది

ఆత్మకూరు: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కాంతారావునాయక్ సూచించారు. స్థానిక బైర్లూటీ ఆస్పత్రి ఆవరణలో సిబ్బందితో కలిసి స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని చేపట్టారు. చీపురు పట్టి చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సింగం గోపాల్, బైర్లూటీ సర్పంచ్ గురువమ్మ, పంచాయతీ కార్యదర్శి చాణక్య తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆత్మకూరు పట్టణంలోని తిక్కయ్యస్వామి దర్గా నుంచి పెద్ద బజార్ వరకు స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఆసియామారూఫ్, కమిషనర్ రమేష్‌బాబు, కో ఆప్షన్ సభ్యులు ఎం.ఏ.రషీద్ తదితరులు పాల్గొన్నారు.

■ బండి ఆత్మకూరు: మండల వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ దస్తగిరి, మండల విద్యాశాఖాధికారులు మోహన్ రెడ్డి , యశోద, ఈఓఆర్డీ రామ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

■ వెలుగోడు: స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్‌లో భాగంగా మండల కేంద్రంలో అధికారులు, నాయకులు ర్యాలీ నిర్వహించి పొట్టి శ్రీరాములు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోడ్లపై చెత్త వేయరాదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస గౌడ్, సర్పంచ్ వేల్పుల జైపాల్ పాల్గొన్నారు.

■ మహానంది: స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మహానంది ఆలయ పరిసరాల్లో శనివారం పారిశుద్ధ్య పనులు చేయించారు. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి పొరక చేతపట్టి పరిసరాల్లో ఉన్న చెత్తను తొలగించారు. ఎం.తిమ్మాపురం గ్రామంలో సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మి, గాజులపల్లెలో మండల ప్రత్యేక అధికారి మురళీకృష్ణ, అబ్బీపురంలో సర్పంచ్ శవ్వా శ్రీలక్ష్మి, పశు వైద్యాధికారి కరుణాకర్, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.